కొడుకును హత్య చేశారు..
పోస్టుమార్టం రిపోర్టు ఇప్పించరూ!

● ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌ను కోరిన వృద్ధురాలు


ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(సెంట్రల్): తన పెద్ద కుమారుడు యు.దేవ దాసు ఆరు సంవత్సరాల క్రితం హత్యకు గురయ్యాడని, పోస్టుమార్టం, ఎంఎల్‌సీ రిపోర్టును కర్నూలు మూడోపట్టణ పోలీసు స్టేషన్ నుంచి ఇప్పించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను బుధవారపేటకు చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు సుంకులమ్మ కోరారు. అప్పట్లో ఆస్తి కోసం కోడలు వసంత, మనువళ్లు డాక్టర్ ఎ.ఆనందరావు, దొలన్నలతోపాటు అజయ్‌కుమార్, రాజ్‌కుమార్ తన కుమారుడు దేవదాసును హత్య చేసి మెడికల్ కాలేజీ సమీపంలో పడేశారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆస్తి కోసం కోడలు, మనువళ్లు తనను హతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య, ఇన్‌చార్జ్ డీఆర్వో వెంకటేశ్వర్లు వినతులను స్వీకరించారు. ప్రజా సమస్యలకు పరిష్కారాలు చూపాలని అధికారులను ఆదేశించారు. సీఎంఓ నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంపై నిర్లక్ష్యం వీడాలని ఆదేశించారు. అక్టోబర్ 1న సీఎం చంద్రబాబునాయుడు పత్తికొండ మండలం పుచ్చకాయలమాడకు వచ్చిన సందర్భంలో ఇచ్చిన 176 అర్జీలపై తనకు నివేదిక సమర్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

➢ జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో సీజనల్ హాస్టళ్లను ప్రారంభించి విద్యార్థుల వలసలను నివారించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా వినతిపత్రం సమర్పించారు.

➢ మూడు అడుగుల రోడ్డు స్థలాన్ని ఆక్రమించారని, దీంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని కల్లూరు మండలం ముజఫర్‌నగర్/ముదిరాజ్ నగర్ చెందిన యూ.శ్రీదేవి ఫిర్యాదు చేశారు.

➢ జిల్లాలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల వసూళ్లను అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మనోహర్, శంకర్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

➢ ఓర్వకల్లు మండలం కేతవరం పంచాయతీలో తొలగించిన క్లాప్ మిత్రలను విధుల్లోకి తీసుకోవాలని ఏఐయూటీయూసీ నాయకులు వి.హరీష్ కుమార్‌రెడ్డి వినతిపత్రం ఇచ్చారు.

➢ కర్నూలు నగరంలోని చిత్తారి వీధి సమీపంలో హంద్రీనదిలో నిర్మించుకున్న ధోభీఘాట్లను కొందరు తొలగించి కొట్టాలు వేసుకుంటున్నారని, చర్యలు తీసుకోవాలని రజకులు విన్నవించారు.

➢ ఇళ్ల పట్టాలు ఇచ్చారని, స్థలాలు చూపడం లేదని, న్యాయం చేయాలని బి.తాండ్రపాడుకు చెందిన వెంకటేశ్వరమ్మ, నాగవేణి తదితరులు కోరారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: నగరంలో 220 కెవీ లైన్ల అభివృద్ధిలో భాగంగా క్యాంపు సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజ్ఞాన మందిర్, బీ క్యాంపు, జేసీ బంగ్లా, అరోరానగర్, అమ్మ హాస్పిటల్ ఏరియా, నంద్యాల చెక్‌పోస్టు, నందికొట్కూరు రోడ్, జొహరాపురం, బిర్లాగడ్డ, డాక్టర్స్ కాలనీ, టెలికాం నగర్, మహాలక్ష్మి నగర్ ప్రాంతాలలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, తిరిగి 3 గంటల నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అలరించిన సంగీత విభావరి

కర్నూలు కల్చరల్: సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సోమవారం నిర్వహించిన తెలుగు హిందీ పాటల సంగీత విభావరి అలరించింది. సంతోష్ అండ్ ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో ఆర్గనైజర్లు రమాదేవి, సమీర్ సంగీత విభావరిని నిర్వహించారు. గాయకులు చంద్రకంటి మద్దయ్య, నాగశేషు, విజయ్, రాణి, భాష, పీటర్ పాడిన పాటలు ప్రేక్షకులను అలరించాయి. అంతకుముందు సెవెన్ స్టార్ ఆర్కెస్ట్రా కళాకారుడు ఫయూమ్ మృతికి శ్రద్ధాంజలి ఘటించారు.

క్లుప్తంగా

పశుసంవర్ధక శాఖ డైరీ విడుదల


డైరీ, పోస్టర్లను విడుదల చేస్తున్న జేడీ జి.శ్రీనివాస్

కర్నూలు(అగ్రికల్చర్): పశుసంవర్ధక శాఖలోని అన్ని కేటగిరీల పారా సిబ్బంది, ఏహెచ్‌ఏలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరిస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ జి.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పశుసంవర్ధక శాఖ జిల్లా కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2025 డైరీ, ఏహెచ్‌ఏల సంఘం టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఫెడరేషన్ నాయకులు నాగవాసవి, సురేష్, స్రవంతి, జనార్ధన్‌రెడ్డి, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు చూపాలి


ధర్నా చేస్తున్న బి.తాండ్రపాడు గ్రామస్తులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు మండలం బి.తాండ్రపాడులో 2013లో ఇచ్చిన ఇళ్ల పట్టాలకు సంబంధించి లబ్ధిదారులకు స్థలాలు చూపించాలని సర్వజన ఐక్యవేదిక అధ్యక్షుడు పి.లక్ష్మన్న డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట బి.తాండ్రపాడుకు చెందిన వందలాది మంది తమకు ఇళ్ల స్థలాలు చూపాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 277లో 1500 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారన్నారు. అయితే ఇంతవరకు స్థలాలు చూపడం లేదన్నారు. ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన స్థలం అలాగే ఉందని, సర్వేయర్లతో కొలతలు వేయించి రాళ్లు నాటిస్తే సరిపోతుందని వివరించారు. గ్రామస్తులు ఎల్లస్వామి, సుగుణ, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ హాస్పిటళ్లలో పనిచేస్తున్న ఒప్పంద సెక్యూరిటీ గార్డులు, పెస్టు కంట్రోల్ కార్మికులకు కనీస వేతనాలు అమలుచేయని ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర సమితి పిలుపు మేరకు కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బాధిత కార్మికులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శానిటేషన్ కార్మికులకు జీఓ నంబర్ 549 ప్రకారం రూ.16 వేలు, సెక్యూరిటీ గార్డులకు జీఓ నంబర్ 43 ప్రకారం రూ.12,900 వేతనం ఇవ్వాలని, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించే ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టాలన్నారు. నాయకులు టి.రామాంజనేయులు, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హాకీ విజేత ఎస్టీబీసీ కాంపౌండ్ జట్టు


ట్రోఫీ అందుకుంటున్న ఎస్టీబీసీ కాంపౌండ్ జట్టు

కర్నూలు (టౌన్): సంక్రాంతి పండుగ పురస్కరించుకొని రెండు రోజులుగా స్థానిక ఎస్టీబీసీ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న 7 ఏ సైడ్ హాకీ టోర్నమెంటు సోమవారం సాయంత్రం ముగిసింది. ఫైనల్ పోటీలో 3-1 స్కోర్‌తో రూల్స్ బ్రేక్ హాకీ జట్టుపై ఎస్టీబీసీ కాంపౌండ్ సీనియర్ హాకీ జట్టు విజేతగా నిలిచి ట్రోఫీని దక్కించుకుంది. విజేతగా నిలిచిన జట్టుకు రాయలసీమ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్, నరేష్‌లు ట్రోఫీలను అందజేశారు. సీనియర్ హాకీ క్రీడాకారులు మాధవరావు, సుదర్శన్, ఆదినారయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

జాతీయ డిబేట్‌లో ప్రతిభ


జి.ఆద్యశ్రీ

కర్నూలు (సిటీ): నగర శివారులోని రిడ్జ్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న జి.ఆద్యశ్రీ సాయి స్కంద ఇండియన్ డిబేటింగ్ లీగ్, ఐబీటీ చెన్నై ఆరేటరీ క్లబ్ వారు సంయుక్తంగా నిర్వహించిన పోటీల్లో అద్భుత ప్రతిభ కనపరిచి సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. ఆ విద్యార్థిని జనవరి 26న రిపబ్లిక్ డే రోజు ఐబీటీ చెన్నైలో జరిగే పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కమల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ విద్యార్థినిని సీఈఓ గోపీనాథ్, కో–సీఈఓ సౌమ్య గోపీనాథ్, డీన్ రాజేంద్రన్ అభినందించారు. చెన్నైలో జరిగే డిబేటింగ్ పోటీల్లో కూడా అద్భుత ప్రతిభను కనబరచాలని ఆకాంక్షించారు.

రహదారి పనులను పూర్తి చేయండి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

కర్నూలు (టౌన్): అసంపూర్తిగా ఉన్న రహదారి పనులతో ఇబ్బందులు పడుతున్నాం. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని పెద్దపాడు సమీపంలోని అపూర్వ శిల్పా రామం కాలనీ వాసులు జయరాజు, గోపాల్ విన్నవించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో కమిషనర్ ఎస్.రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే పలువురు తమ కాలనీ సమస్యలను కమిషనర్‌కు వివరించారు. పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదనపు కమిషనర్ క్రిష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్యశాఖాధికారి విశ్వేశ్వర రెడ్డి, ఎస్‌ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్‌ఓ జునీద్‌లు పాల్గొన్నారు.

విన్నపాలు ఇవే..

➤ రాధానగర్, రేణుకా నగర్‌లో మురుగు కాల్వలు నిర్మించాలని స్థానికులు శ్రావణ్‌కుమార్, మహేష్ అర్జీలు ఇచ్చారు.

➤ మామిదాలపాడు నెహ్రూనగర్‌లో నూతనంగా నిర్మించిన కల్వర్టు వద్ద మురుగు సమస్య పరిష్కరించాలని ప్రదీప్ అనే వ్యక్తి వినతిపత్రం అందజేశారు.

➤ సంతోష్‌నగర్‌లోని మున్సిపల్ పార్కులో అభివృద్ధి పనులు చేపట్టాలని కాలనీ అధ్యక్షుడు చంద్రశేఖర్ అభ్యర్థించారు.

➤ అశోక్‌నగర్, శ్రీకృష్ణ కాలనీ పార్కులో మోటారు మరమ్మతు పనులు చేపట్టాలని, అలాగే నడక దారి ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కృష్ణమూర్తి విన్నవించారు.

➤ చెక్‌పోస్టు నుంచి జొహరాపురం వెళ్లే మార్గంలో చంద్రశేఖర్ నగర్ వద్ద వేసిన తాగునీటి పైపులైన్‌ను ప్రధాన పైపులైన్‌కు అనుసంధానం చేయాలని స్థానికులు రామకృష్ణ, సుశీలమ్మ కోరారు.

సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (టౌన్): కాలనీల్లో ఏర్పడే చిన్నపాటి సమస్యలను సంబంధిత అధికారులు సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. సోమవారం తెల్లవారుజామున నగరంలోని ఏ.క్యాంపు, జొహరాపురం కాలనీల్లో కమిషనర్ పర్యటించారు. స్థానిక సమస్యలతో పాటు పారిశుద్ధ్యంపై తనిఖీ చేశారు. కొండారెడ్డి బురుజు వద్ద మ్యాన్ హోల్‌పై మూత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మురుగు కాల్వల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. డీఈఈ మనోహర్ రెడ్డి, ఏఈ రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాజ్ డ్రమ్మర్ షేక్ ఫయూం మృతికి సంతాపం


కళాకారులతో షేక్ ఫయూం (ఫైల్)

కర్నూలు కల్చరల్: సెవెన్ స్టార్ ఆర్కెస్ట్రా, రికార్డింగ్ స్టూడియో అధినేత జాజ్ డ్రమ్మర్ షేక్ ఫయూం మృతికి పలు కళాసంస్థలు, సాహిత్య సంస్థలు, కళాకారులు సంతాపం ప్రకటించారు. కర్నూలులో ఎంతో మంది కొత్త గాయకులను పరిచయం చేసిన కళాకారుల కల్ప తరువు ఫయూం అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్ష కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ్యా పేర్కొన్నారు. ఫయూంతో కలిసి పది లఘు చిత్రాల్లో కలిసి పని చేశానని, ఆయన రికార్డింగ్ థియేటర్‌లోనే లఘు చిత్రాలకు డబ్బింగ్ చెప్పానని, ఆ సమయంలో చాలా మెలకువలు తెలుసుకున్నానని సినీనటులు మీనాక్షి రెడ్డి పేర్కొన్నారు. ఫయూం మృతి కళారంగానికి తీరని లోటన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం


పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల వద్ద కేజీ రోడ్డుపై పారుతున్న మురుగునీరు


కర్నూలు(రూరల్): గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. మండలంలోని వెంకాయపల్లె గ్రామంలోని పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలో డ్రైనేజీ పూడికతో నిండిపోవడంతో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. కర్నూలు – గుంటూరు ప్రధాన రహదారిపైనే మురుగు పారుతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఈ రహదారిపై రాకపోకలు సాగించేవారు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి సమీపాన మసీదు, ఇంజినీరింగ్ కాలేజీ, దుకాణాలు, బస్టాప్ ఉన్నందున అందరికీ ఇబ్బందులు తప్పడం లేదు. మురుగు నీరు రోడ్డుపై పారుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీరాజ్ ఇంజినీర్లు

కర్నూలు(అర్బన్): రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయని, ప్రతిఒక్కరూ రహదారి భద్రతపై అవగాహన పెంచుకోవాలని పంచాయతీరాజ్ ఈఈ ఎన్‌సీఎస్ మద్దన్న సూచించారు. 36వ జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పంచాయతీరాజ్ ఇంజినీర్లు సోమవారంలో నగరంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. అతి వేగంగా డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా మోటారు సైకిళ్లు నడపరాదని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఈఈ మద్దన్న మాట్లాడుతూ.. యువత సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు డ్రైవింగ్ చేయడం వల్ల కూడా అధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, సూత్రాలు, జాగ్రత్తలను తప్పక పాటించాలన్నారు. డీఈఈలు మహేశ్వరరెడ్డి, కర్రెన్న, నాగిరెడ్డి, ఏఈలు ఆర్ సతీష్‌కుమార్, ముక్తార్‌బాషా, రవిమోహన్‌రెడ్డి, అచ్యుతానందరెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

మహిళకు అరుదైన శస్త్రచికిత్స


ఆపరేషన్ అనంతరం కోలుకున్న మహిళతో డాక్టర్ అశోక్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): మెదడులో కీలకమైన రక్తనాళం ఉబ్బిపోయి పగిలిపోవడంతో అంతర్గత రక్తస్రావమైన ఓ మహిళకు కర్నూలులోని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు అత్యాధునిక పరికరంతో శస్త్రచికిత్స నిర్వహించి ఊరట కల్పించారు. వివరాలను సోమవారం ఆసుపత్రి కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్టు డాక్టర్ కసిరెడ్డి అశోక్‌రెడ్డి తెలిపారు. కర్నూలుకు చెందిన 55 ఏళ్ల గృహిణి సావిత్రి తీవ్రమైన తలనొప్పితో బాధపడుతూ కిమ్స్ హాస్పిటల్‌కు రాగా ఆమెను పరిశీలించి తగిన వైద్య పరీక్షలు చేయించామన్నారు. మెదడులో ఉండే ఒక పెద్ద యాంటీరియర్ కమ్యూనికేటింగ్ ఆర్టరీ అనే అనే రక్తనాళం ఉబ్బిపోయి పగిలినట్లు గుర్తించామని తెలిపారు. ఇలాంటి వాటికి గతంలో క్లిప్పింగ్ లేదా కాయిలింగ్ లాంటివి చేసేవారమని, ఈ రోగిలో చీలిక ఎక్కువగా ఉండటంతో వెబ్ అనే అత్యాధునిక పరికరాన్ని ఉపయోగించి చిన్నరంధ్రం చేసి పగిలిన రక్తనాళాన్ని అతికించి రక్తప్రసారం సాధారణంగా ఉండేలా చేశామని తెలిపారు. ఇలాంటి చికిత్సలో తక్కువ రిస్క్ ఉంటుందని, రోగి త్వరగా కోలుకుంటారన్నారు.

30 నుంచి నవరాత్రి మహోత్సవాలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు శ్రీ రాజ శ్యామలా అమ్మవారికి నవరాత్రి పూజా మహోత్సవాలను నిర్వహించనున్నట్లు లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం తెలిపారు. శ్రీ లలితా సంఘం అధ్యక్షులు జ్ఞానేశ్వరమ్మ ఆధ్వర్యంలో ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు పూజ, ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

రేపు అనఘాష్టమి వ్రతం

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఈనెల 22వ తేదీ ఉదయం 9 గంటలకు దత్తాత్రేయ స్వామి వారికి అనఘాష్టమి వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ తెలిపారు. లోక కల్యాణార్థం నిర్వహించే వ్రతంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న లెక్చరర్‌ను కఠినంగా శిక్షించాలని డీవైఎఫ్‌ఐ, ఐద్వా జిల్లా కార్యదర్శులు నగేష్, అలివేలమ్మ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులు లైంగిక వేధింపులకు పాల్పడితే ఎలా అని, తక్షణమే బాధ్యుడైన లెక్చరర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఏపీజీబీ ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే ఉంచాలి

కర్నూలు(అగ్రికల్చర్): విలీనం తర్వాత అతిపెద్ద బ్యాంకుగా అవతరించనున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని వైఎస్సార్ జిల్లా కేంద్రంలోనే కొనసాగించాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ నేతలు కోరారు. ఈ మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డిని కర్నూలులోని ఆయన నివాసంలో కమిటీ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సేవ్ పబ్లిక్ సెక్టారు కమిటీ నేతలు మాట్లాడుతూ.. దక్షిణ భారత దేశంలో ఏ గ్రామీణ బ్యాంకుకు లేని విధంగా ఏపీజీబీకి కడపలో అన్నిరకాల మౌలిక సదుపాయాలు, కరెన్సీ చెస్ట్‌తో ప్రధాన కార్యాలయం ఉందని, ప్రభుత్వం కేటాయించిన భూమిలోనే శాశ్వత భవనం నిర్మించినట్లు తెలిపారు. ఆర్థిక శాఖ మార్గదర్శకాల ప్రకారం ఏ బ్యాంకులో విలీనమైతే ప్రధాన కార్యాలయాన్ని అక్కడే కొనసాగించాల్సి ఉందని వివరించారు. బైరెడ్డి స్పందిస్తూ ఈ విషయమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చిస్తామని తెలిపారు. సేవ్ పబ్లిక్ సెక్టారు కమిటీ నాయకులు ఈ.హన్మంతురెడ్డి. రియాజ్‌బాష, సురేష్, ఎంసీవీ రమణారెడ్డి, నాగరాజు, వెంకటేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

20 సూత్రాల కమిటీ చైర్మన్ రాక

కర్నూలు(సెంట్రల్): 20 సూత్రాల ప్రోగ్రామ్ చైర్మన్ లంక దినకర్ ఈ నెల 23వ తేదీన కర్నూలుకు రానున్నారు. ఆయన 22వ తేదీ రాత్రి కర్నూలుకు చేరుకొని 23వ తేదీన అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. అనంతరం గుంటూరుకు బయలుదేరి వెళతారు.

ప్రైవేటు ఆస్పత్రికి ఆరోగ్యశ్రీ గుర్తింపు

కర్నూలు (హాస్పిటల్): నగరంలోని ఎన్‌ఆర్ పేటలో ఉన్న అమిత హాస్పిటల్‌కు ఎన్‌టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) గుర్తింపు లభించినట్లు ఆసుపత్రి అధినేత కృష్ణ మావి చాపె తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్‌టీఆర్ వైద్యసేవ కింద గైనిక్, పీడియాట్రిక్, సర్జరీ, ఆర్థోపెడిక్, యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, నెఫ్రాలజీ, ఈఎన్‌టీ విభాగాల్లో ఉచితంగా వైద్యసేవలు అందిస్తామన్నారు. అలాగే జనరల్ ఫిజీషియన్ ద్వారా ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు ఆసుపత్రిలో ఉచిత వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఉద్యోగ నియామకాలపై వదంతులు నమ్మొద్దు

కర్నూలు న్యూసిటీ: మైనింగ్ శాఖలో ఎలాంటి ఉద్యోగ నియామకాలు చేపట్టడం లేదని ఆ శాఖ జిల్లా ఉప సంచాలకులు రవిచంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్యాండ్ రీచ్‌లలో ఔట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్లు వాట్సాప్ గ్రూప్‌లలో నిరాధారమైన వార్తలు వస్తున్నాయని వాటిని నమ్మవద్దని సూచించారు. నిరుద్యోగ యువత ఇలాంటి వదంతులు నమ్మి మోసపోవద్దని, వదంతులు సృష్టించే వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

వలసలు కనిపించడం లేదా?


వలస వెళుతున్న వారితో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో ఊర్లకు ఊర్లు ఉపాధి కోసం వలస వెళ్తుంటే అధికారులు, ప్రజాప్రతినిధులకు కనిపించడం లేదా? అని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ప్రశ్నించారు. చంటి బిడ్డలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులతో సహా రోజుకు పదుల సంఖ్యలో వాహనాల్లో ఆదోని ప్రాంత ప్రజలు హైదరాబాద్, మహబూబ్ నగర్, గుంటూరుకు వలస వెళ్తున్నారన్నారు. ఆదివారం రాత్రి 9.30 గంటలకు హైదరాబాద్‌కు ఐచర్ వాహనంలో వలసవెళ్తున్న వారిని కర్నూలు సమీపంలో సీపీఎం నాయకులు కలిశారు. వారితో మాట్లాడగా.. గ్రామాల్లో పనులు లేకే వలస వెళ్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. పశ్చిమ ప్రాంతం నుంచి ఊర్లకు ఊర్లు వలస వెళ్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు మాత్రం జిల్లాలో వలసలు లేవని చెప్పడం దుర్మార్గమన్నారు. గ్రామాల్లో పనులు కల్పించాలని, విద్యార్థుల కోసం సీజనల్ హాస్టళ్లను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు గురుశేఖర్, రంగప్ప, కరుణాకర్ పాల్గొన్నారు.

పదవుల కోసం కూటమి నేతల పాకులాట

కర్నూలు (టౌన్): త్వరలోనే కూటమి ప్రభుత్వం కూలడం ఖాయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ తనకు ప్రత్యక్షంగా సంబంధం లేకున్నా వ్యక్తిగత ఎజెండాతో ముందుకు వెళుతూ ప్రజలు తనను క్షమించాలని మాట్లాడటం రాజకీయ ఎత్తుగడలో భాగమే అని పేర్కొన్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ వ్యవహార శైలి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అర్థం అయ్యిందని, అదును చూసి డిప్యూటీ సీఎంను తొక్కేసేందుకు పావులు కదుపుతున్నట్లు స్పష్టంగా అర్థమవుతోందని వివరించారు. ఇప్పటికే టీడీపీ, జనసేనల మధ్య పదవుల కోసం వార్ మొదలైందని తెలిపారు. ప్రజా ప్రయోజనాలు పక్కన పెట్టి వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాల కోసం కూటమి పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం ప్రారంభమైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజల మద్దతుతో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన స్పష్టంచేశారు.

23న రాయలసీమ విద్యార్థుల సదస్సు

ఆదోని సెంట్రల్: పట్టణంలో ఈ నెల 23వ తేదీన జరిగే రాయలసీమ విద్యార్థుల సదస్సును జయప్రదం చేయాలని పీడీఎస్‌ఓ రాష్ట్ర నాయకులు రంగస్వామి, మహేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సదస్సుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ నిత్యం కరువు కాటకాలతో పాటు నీటి కొరత వ్యవసాయం, పారిశ్రామిక సంక్షోభంతో ప్రజలు అల్లాడి పోతున్నారని తెలిపారు. బతుకు జీవుడా అంటూ ప్రజలు వలసబాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాయలసీమ విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్నారు. రాయలసీమ విద్యార్థుల సదస్సులో విద్యా, ఉపాధి రంగ సమస్యలు, పరిష్కారానికి పోరాట కార్యచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, మేధావులు సదస్సులో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భీరప్ప గుడి నిర్మాణానికి రూ.1.10 లక్షల విరాళం


దాత కొడితం శివప్రసాద్‌ను సన్మానిస్తున్న సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): నగర శివారుల్లోని పెద్దపాడు రోడ్డు మోడల్ స్కూల్ సమీపంలో నిర్మిస్తున్న భీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి అవసరమైన 350 టిప్పర్ల మట్టి తోలేందుకు రూ.1.10 లక్షలను కొడితం శివప్రసాద్‌రెడ్డి విరాళంగా అందించారని కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. సోమవారం దాత శివప్రసాద్ దేవాలయ నిర్మాణ పనులను పరిశీలించి ఆర్థిక సాయం అందించారన్నారు. దాతకు పూలమాల వేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాల సుంకన్న, కోశాధికారి వెంకటేశ్వర్లు, నాయకులు కేసీ నాగన్న, గుడిసె శివన్న, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగస్వామి మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణం, కమ్యూనిటీ హాల్, విద్యార్థులకు హాస్టల్ నిర్మాణాలకు దాతలు ముందుకు వచ్చి ఆర్థికంగా సహకరించాలని కోరారు.

భారతి ఆచూకీ కనిపెట్టడంలో పోలీసుల విఫలం


కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగిన ప్రజాసంఘాల నాయకులు

కర్నూలు(సెంట్రల్): కల్లూరు మండలం నాయకల్లుకు చెందిన భారతి అనే మహిళ ఆచూకీ కనిపెట్టడంలో పోలీసులు విఫలమయ్యారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళ ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి విమర్శించారు. సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో భారతి అదృశ్యం మిస్టరీపై పోలీసుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జనవరి 1న భర్త రవికుమార్‌తో గొడవపడిన భారతి అదేరోజు హంద్రీ–నీవా కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారని, అయితే ఇంత వరకు ఆమె ఆచూకీ గానీ, మృతదేహం గానీ దొరకలేదన్నారు. పోలీసులు అన్ని కోణాల్లో సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మీ, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్. కైలాష్ నాయక్, కులాల ఐక్య వేదిక కన్వీనర్ టి.శేషఫణి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ విధానాలు ప్రమాదకరం'



సమావేశంలో మాట్లాడుతున్న వి.శంకర్

కర్నూలు(సెంట్రల్): బీజేపీ రాజ్యాంగ వ్యతిరేక విధానాలతో రాష్ట్రాల స్వయంప్రతిపత్తి, పౌర హక్కులకు ప్రమాదం వాటిల్లిందని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యుడు వి.శంకర్ ఆరోపించారు. సోమవారం అంబేడ్కర్ భవన్‌లో ఆ పార్టీ ఆధ్వర్యంలో రాయలసీమ జిల్లాల రాజ్యాంగ పరిరక్షణ సదస్సు జరిగింది. సదస్సుకు ఆ పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యుడు వి.శంకర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బి.బంగార్రావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.శంకర్ మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ చెప్పు చేతుల్లో మోదీ ప్రధానమంత్రిగా పనిచేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ అన్నారు. మోదీ 11 ఏళ్ల పాలనలో దేశాభివృద్ధి వందేళ్ల వెనక్కు వెళ్లిపోయిందని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేనతో బీజేపీ రాజకీయ స్వారీ చేస్తోందని, ఆ మూడు పార్టీలకు తగిన బుద్ధం చెప్పాలని పిలుపు నిచ్చారు. నాయకులు వెంకటేశ్వరరావు, ఉదయ్‌కిరణ్, రమణయ్య, నాగరాజు, వేమన పాల్గొన్నారు.